ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
గురువారం 14 ఆగస్టు 2025




చిట్యాల శివారులో గండిపడిన ఎస్సారెస్పీ కాల్వ



- ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూ సమస్యలపై 2.60 లక్షల దరఖాస్తులు
- దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి విచారణ జరుపుతున్న అధికారులు
- దరఖాస్తుల్లో 10 శాతం కూడా పరిష్కారం కాని వైనం
- దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామా, అసైన్డ్ భూములవే...
- కోర్టు తీర్పు సాకుతో పరిష్కారాన్ని పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- భూ భారతితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశలో రైతులు

ఇలాగైతే పరిష్కారం ఎలా!?

ఆగస్టు 15 నాటికి భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని లక్ష్యం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంద్రాగస్టు నాటికి భూ భారతిలో దరఖాస్తులను పరిష్కరించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కోర్టు కేసులు, భూ వివాదాల మూలంగా స్వీకరించిన దరఖాస్తులు ఇంకా ఒక్క రోజులో పరిష్కరించటం అసాధ్యమనే టాక్ వినబడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,377 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ద్వారా 2,35,990 దరఖాస్తులను స్వీకరించారు. అయితే భూ భారతి సదస్సుల్లో దరఖాస్తుల రాగా, వీటిలో అత్యధికంగా సాదాబైనామాలు, అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులే ఉండగా, సాదాబైనామాల దరఖాస్తులపై హైకోర్టులో కేసు ఉండటంతో వీటి పరిశీలనను ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇక మిగిలిన దరఖాస్తులో అత్యధికంగా వివాదస్పమైనవి, కోర్టు కేసుల్లో ఉన్నవే ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మొత్తం దరఖాస్తుల్లో పది శాతం కూడా పరిష్కరించే అవకాశం లేకుండా పోయింది.

భారీగా దరఖాస్తులు..

ధరణి కష్టాలకు చెక్ పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏప్రిల్ 14న భూ భారతి పోర్టల్‌ను తీసుకవచ్చింది. గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 17వ తేదీన రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, అందులో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని కూడా చేర్చారు. అలాగే మే 15వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా 28మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం, హనుమకొండ జిల్లా నడికూడ, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ ఆరు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 17,319దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 3వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుంది. జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 2,35,990 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో వరంగల్ జిల్లా నుంచి 53,933 దరఖాస్తులు రాగా, హనుమకొండ జిల్లాలో 34,973, జనగామ జిల్లాలో 17,867, మహబూబాబాద్ జిల్లాలో

(మిగతా 7లో..)

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు..

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	భూభారతి దరఖాస్తులు	సాదాబైనామాలు
వరంగల్	191	57,850	26,630
హనుమకొండ	163	34,973	27,057
జనగామ	176	17,867	10,350
మహబూబాబాద్	288	39,419	31,250
భూపాలపల్లి	223	53,763	51,347
ములుగు	336	32,118	20,150
మొత్తం	1,377	2,35,990	1,66,784

రెడ్ అలర్ట్

భూపాలపల్లి జిల్లాలో జోరువాన

- నిండిన చెరువులు, కుంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పత్తి, వరి పంటలు
- బొగ్గు ఉత్పత్తికి రెండో సైతం కలిగిన ఆటంకం
- పరవళ్లు తొక్కుతున్న గోదావరి


మహాముత్తారం సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

కృష్ణకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ భూపాలపల్లి జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు సగటు వర్షపాతం 78.0 మి.మీ నమోదైంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధిక వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రచిస్తోంది. వివిధ శాఖల అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే అలర్ట్ చేస్తున్నారు. మంగళవారం రాత్రంతా జోరువాన కురిసింది. ఉదయం నుంచి వర్షాప్రభావం లేక పోయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా జలకళ సంతరించుకుంది. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. తద్వారా సమీప ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి.

జిల్లాలో సగటు వర్షపాతం 78.0 మి.మీ

జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో సగటు వర్షపాతం 78.0 మిల్లీ మీటర్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 30.6, పలిమెలలో 45.8, మహాముత్తారంలో 73.2, కాటారంలో 48.4 మల్హర్‌లో 61.2, చిట్యాలలో 168.4, టేకుమట్లలో 70.4, మొగుళ్లపల్లిలో 64.8, రేగొండలో 135.6, గణపురంలో 84.6, భూపాలపల్లిలో 75.8, కొత్తపల్లిగోరి మండలంలో 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు వివరించారు.

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

భూపాలపల్లి సింగరేణి ఏరియాకు రెండో రోజు సైతం వర్షం నష్టాన్ని చేకూర్చింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఓసీ-2, ఓసీ-3లోని బొగ్గు ఉత్పత్తికి ఆటంకం (మిగతా 8వ పేజీలో)


కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం

కాళేశ్వరం వద్ద ప్రాణహిత పరుగులు

మహదేవపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత పరుగులు పెడుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరితో పాటు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. బు.ధవారం కాళేశ్వరం వద్ద 6.55 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

బుగులోని జాతర అభివృద్ధికి కృషి

- రూ.1.5 కోట్లతో పనులు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బొగులోని వెంకటేశ్వర స్వామి జాతర అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఇందుకు రూ. కోటి 50 లక్షలు కేటాయిస్తున్నామని అన్నారు. మండలంలోని తిరిమలగిరి శివారులో ఉన్న బుగులోని వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ మండలంలో ప్రసిద్ధి చెందిన బుగులోని జాతర అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌకర్యార్థం మెట్లు, కోనేరు విస్తీరణ పనులు, విశ్రాంతి భవనాలను నిర్మించంచనున్నట్లు తెలిపారు. ఈ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. పాండవులగుట్ట జాతరను అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, బుగులోని జాతర చైర్మన్ వెంటకటస్వామి, నాయకులు నిమ్మల విజేందర్, పల్నాటి శ్రీను, గంగుల రమణారెడ్డి, వీరబ్రహ్మం, ఆకుతోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

వెంకటాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీఆర్పీఎఫ్ జవాన్లు మండల కేంద్రంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన పాత మార్కెట్, వేపచెట్టు మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. సీఆర్‌పీఎఫ్ జవాన్లు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు.

- వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. సీఆర్పీఎఫ్ జవానులు, సివిల్ పోలీసులు జాతీయ జెండాలను గ్రామంలోని పురవీధుల్లో ప్రదర్శిస్తూ ప్రతి ఇంటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ అనీష్, వాజేడు ఎస్సై జక్కుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.
- ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మొదలైన ఈ ర్యాలీ జాతీయ రహదారి మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. నాయకులు, విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలు సుమారు 150 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు నగరపు రమేష్, కొత్త సురేందర్, భూక్యా జవహర్‌లాల్, శీలమంతుల రవీంద్రాచారి, కొత్త సుధాకర్‌రెడ్డి, రవిరెడ్డి, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటాపురంలో జాతీయ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్‌లు

సింగరేణిలో ఉత్తమ ఉద్యోగులుగా 14 మంది

కృష్ణకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో పని చేస్తున్న 14 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వివిధ గనుల్లో పని చేస్తున్న కొలిపాక అజయ్, సిద్ద సమ్మయ్యఎం.డి.సర్వర్‌మియా, బర్ల రవీందర్, నల్లాల ప్రభాకర్‌రెడ్డి, గూడెపు ధర్మయ్య, బండా అచ్యుత్‌రెడ్డి, పెండరి సారంగం, గండి నరేందర్, ఎ. మహేందర్, ఎం.డి.సలీం, బర్ల నారాయణ, మచ్చ శివకుమార్‌ను ఎంపి చేయగా భూపాలపల్లి సుభాష్‌కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జీఎం చేతుల మీదుగా వీరు ప్రశంసా పత్రాలను అందుకోనున్నారు. అలాగే కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో భూపాలపల్లి ఏరియాకు చెందిన మిద్దెపాక మురళి ఉత్తమ ఉద్యోగిగా సీఎండీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతీ తెలిపారు. అదే విధంగా ఉత్తమ విద్యార్థినులుగా లక్ష్మీశివాణి, విజలక్ష్మి ఎంపిక కాగా భూపాలపల్లిలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జరిగే వేడుకల్లో వీరు ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, చిత్రంలో ఎస్పీ కిరణ్ ఖరే

అధికారులు అందుబాటులో ఉండాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ కిరణ్‌ఖారేతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ,పంచాయితీరాజ్,ఇరిగేషన్,వైద్య, విద్యుత్,వ్యవసాయ, ఆర్అండ్‌బీ, మున్సిపాల్ అధికారులతో మాట్లాడిన కలెక్టర్ జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 72 గంటల పాటు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న దృష్ట్యా ప్రజలు బయటకు రాకుండా ఇంటి వద్దనే ఉండేలా అవగాహన కల్పించాలన్నారు.

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. కాజ్‌వేలపై ప్రజలు ప్రయాణం చేయకుండా బారికేడ్, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు వాటిల్లా కుండా అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబాలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్బందులు ఎదురైన ప్రజలు కలెక్టరేట్‌లో 9030632608 కంట్రోల్ రూంకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


వైభవంగా మహా లింగార్చన

కాళేశ్వరాలయంలో 365 లింగాలతో ప్రత్యేక పూజ

మహదేవపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అనివెట్టి మండపంలో ఆలయ అర్చకులు, వేదపండితులు 365 మట్టి లింగాలతో ప్రత్యేక పూజ చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య శ్రావణమాసంలో మహాలింగార్చన పూజ నిర్వహిస్తే లోక కల్యాణం, సర్వసిద్ధి, ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహాలింగార్చనలో భాగంగా చెన్నూర్‌కు చెందిన మారుతి భజన మండలి ఆధ్వర్యంలో సుమారు 3 గంటలపాటు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ముఖ్యఅర్చకులు పనకంటి ఫణీంద్ర శర్మ, వేదపండితులు వైకుంఠ పాండేతోపాటు అర్చకులు, ఈవో మహేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు భక్తులు

పంద్రాగస్టు వేడుకలకు బెల్లయ్య నాయక్



భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ ప్రధాన వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ హాజరు కానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో స్వతంత్ర్య వేడుకలు జరగనున్నాయి.

పోలీస్ సర్కిల్‌గా గణపురం

నేటి నుంచి మనుగడలోకి..


గణపురం పోలీస్ స్టేషన్

గణపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు, మరోవైపు సింగరేణితో పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న గణపురం మండలం నూతన పోలీస్ సర్కిల్‌గా ఏర్పాటు అవుతోంది. గురువారం నుంచి మనుగడలోకి రానుంది. దీని కార్యాలయం మండల కేంద్రంలో అదే రోజు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతోపాటు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే హాజరు కానున్నారు. సీఐగా కరుణాకర్‌రావు బాధ్యతలు స్వీకరించనున్నారు. గణపురం, రేగొండ, గోరికొత్తపల్లి మండలాలను కలుపుకుని నూతన సర్కిల్‌గా ఏర్పాటు చేస్తున్నారు.

నిజాంకాలం నుంచే గణపురంలో ఠాణా

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే నిజాం పాలన కాలంలో గణపురం, చెల్పూరులో పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గణపురంలోని పోచమ్మగుడి సమీపంలో ఉన్న పాత భవనాన్ని కూలగొట్టి (మిగతా 8వ పేజీలో)

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలు ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం ఉందని భావిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో ప్రజలు ఎవరూ వాగులు, వంకలు దాటి వెళ్లొద్దని సూచించారు. వర్షాలు పడుతుండటంతో నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు కుంగె ప్ర మాదం ఉన్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

వర్షపు నీటిని తొలగించాలి

● శాస్త్రవేత్త క్రాంతికుమార్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న పంటల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతికుమార్ రైతులకు సూచించారు. బుధవారం శాస్త్రవేత్త స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పత్తిలో వర్షపు నీటిని తొలగించిన తర్వాత 15-20 కిలోల యూరియాను, 20 కిలోల పోటాష్‌ను వేసుకోవాలని చెప్పారు. భూమిలో తేమ అధికంగా ఉంటే వేరు పోషకాలు తీసుకోవాని చెప్పారు. పైపాటుగా 20 గ్రాముల పోటాషియంనైట్రైట్ పిచికారి చేసుకోవాలన్నారు. వరిలో నారుమడికి 19:19:19 పోషకాన్ని 10 గ్రాముల కార్బండైజంతో కలిపి మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

జీజీహెచ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌ను కలెక్టర్ రాహుల్‌శర్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరిశీలించారు. మంగళవారం వర్షానికి ఆస్పత్రిలోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బందులు పడ్డ ఘటనపై ఆరా తీశారు. వైద్య ఆరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపునీరు ఆస్పత్రిలోకి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ తక్కువ ఎత్తులో ఆస్పత్రి నిర్మాణం చేపట్టినందునే వరదనీరు పరిసరాల్లోకి వస్తోందన్నారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, ఆర్ఎంవో దివ్య, టీజీఎంఐడీసీ ఏఈ రవి కిరణ్ తదితరులు ఉన్నారు.

సీఐఆర్‌డీఏపీలో పీవోగా కల్వల వాసి

● ఐరాస ఆధ్వర్యంలో 15 దేశాల్లోని సంస్థ

● బంగ్లాదేశ్ ఢాకాలో విధులు

● గ్రామస్థుల హర్షం

కేసముద్రం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో 15 దేశాల్లో గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం కొనసాగుతున్న సెంటర్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ ఆసియా, అండ్ పసిఫిక్ (సీఐఆర్‌డీఏపీ)లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వలకు చెందిన తాడబోయిన వెంకటమల్లు నియామకం అయ్యారు.

ఈ మేరకు బుధవారం ఆ సంస్థ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో కేంద్ర కార్యాలయంగా పనిచేస్తున్న ఈ సంస్థ ఆయా దేశాల్లోని ప్రభుత్వాల సమన్వయంతో గ్రా మీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తోంది. 15 దేశాల నుంచి ఇద్దరి చొప్పున 30 మం ది పేర్లను సంస్థకు సిరఫారసు



వెంకటమల్లు

చేయగా మూడు దశల్లో పరిశీలనలు, రెండు ఇంటర్వ్యూల అనంతరం వెంకటమల్లు ఎంపిక కావడం విశేషం. త్వరలోనే ఢాకాలో తన పోస్టులో విధుల్లో చేరనున్నట్లు వెంకటమల్లు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థలో రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి పోస్టును సాధించిన ఆయన నియామకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

● మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మానుకోట పార్లమెంటు సభ్యులు పోరిక బలరాంనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే ప్రమాదముందని ఎవరు వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్ల వద్దని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసి నిరంతరం పర్యవేక్షణ చేసేలా ఆదేశాలు జారీ చేశారని వివరించారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో వాగులు అధికంగా ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ శ్రేణులు కూడా ప్రజలకు అండగా నిలవాలన్నారు.

డబ్బులు చెల్లించాలని ఉపాధిహామీ కూలీల ధర్నా



ఎంపీడీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వెంకటాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసిన తమకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కూలీలు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో 18 పంచాయతీల కార్మికులు పనులు చేసి రెండునెలలు కావస్తున్నా నేటి వరకు డబ్బులు చెల్లించలేదని అన్నారు.

ఇప్పటికైనా డబ్బులను త్వరగా అందించాలని, లేనట్లయితే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల నర్సింహచారి, నిర్మల, రజిత శ్రీను, కంతి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రంలో వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కొత్తగూడలో జాతీయ పతాకాలతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

కేసముద్రం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్వర్యంలో వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి వివేకానంద విగ్రహం వరకు భారీ జెండాతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతీ ఒక్కరి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి వేలం శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదిల నర్సింహారెడ్డి, రామడుగు వెంకటాచారి, బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్, గాంతి వెంకట్‌రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, ఎండీ.ఖాసీం, మల్యాల రాములు, ఎలబోయిన కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కొత్తగూడ : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జాతీయ జెండా చేబూని వాడవాడలా తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, ప్రధాన కార్యదర్శి బోనాల ప్రవీణ్ చారి, జిల్లా నాయకులు తోటకూరి మధు, కోశాధికారి తుపాకుల పరశురామ్, మాజీ మండలాధ్యక్షుడు వాసం మునీందర్, నాయకులు భిక్షపతి, రూప్లా, కొట్టె శ్రీనివాస్, వజ్జ శ్రీనివాస్, వజ్జ రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న సమ్మయ్య

గోవిందరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రానాగారానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరాకుల సమ్మయ్య జాతీయ స్థాయిలో బెస్ట్ సైడ్ యాక్టర్ అవార్డు అందుకున్నారు. సోషల్ మీడియా వేదికగా 100కుపైగా షార్ట్ ఫిల్మ్ నిర్మించి నటించి తెలంగాణలోని పల్లెల జీవన విధానాలు, యాస, భాషలతో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. అంతరించిపోతున్న కళలైన యక్షగానం, మహాభారత కథలతో వివిధ వేషధారణతో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఎన్నో ప్రదర్శనలు చేశారు. వాటిని గుర్తించిన జాతీయ స్థాయి హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సమ్మయ్యకు జాతీయస్థాయిలో బెస్ట్ సైడ్ యాక్టర్ అవార్డును అందజేశారు. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ అధ్యక్షుడు కొంపెల్లి సత్యనారాయణతోపాటు స్వర్ణగిరి దేవాలయ అధినేత మనేపల్లి రామారావుల చేతులమీదుగా సమ్మయ్య అవార్డు అందుకున్నారు.



ప్రముఖుల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సమ్మయ్య

జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

● టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ, ప్రభుత్వం సూచన ప్రకారం.. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్‌తో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో బుధవారం రాత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్దంగా ఉన్నాయని, అవసరం ఉన్నచోట వారి సేవలను వినియోగించుకునేందుకు యంత్రాంగం సిద్దంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూం ద్వార వచ్చిన ఫిర్యాదులకు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూరియా కోసం బారులు

నెల్లికుదురు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా కోసం బుధవారం రైతులు బారులు తీరారు. వారం రోజుల నుంచి వర్షాలు కురవడంతో వరినాట్లు వేయడానికి రైతులు సమయత్తం అయ్యారు. నాట్లకు, పత్తి పంటలకు యూరియా అవసరం ఉండటంతో గోదాం ముందు రైతులు బారులు తీరారు. ఒకలారీ యూరియా మాత్రమే రావడంతో కొంతమంది మంది రైతులకు మాత్రమే ఇచ్చారు. మిగతా రైతులు నిరాశతో వెళ్లిపోయారు. రైతులకు సరిపడా యూరియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



పీఏసీఎస్ గోదాం ఎదుట బారులు తీరిన రైతులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెంటయ్య (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన రిక్షా కార్మికుడు మంగళపల్లి పెంటయ్య (60) ఈ నెల 9న ఓ ప్రైవేటు కార్యక్రమంలో టెంటు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగలడంతో షాకు గురై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే పెంటయ్య మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా, ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొదుపు సంఘాలను మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

నెల్లికుదురు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళా సంఘాలను మోసం చేసిన కేసులో బుధవారం ఓ వ్యక్తికి తొర్రూరు కోర్టు మెజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్ ఏడాది జైలు శిక్ష, 5 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై సీహెచ్. రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని నారాయణపురంనకు చెందిన వరలక్ష్మీ గ్రామైఖ్య సంఘం వీవోఏ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న జాటోత్ రామూర్తి 2015 సంవత్సరంలో 20 మహిళ సంఘాల డబ్బులు రూ. 4,15,781 స్వాహా చేశాడని అదే గ్రామానికి చెందిన వరలక్ష్మీ గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై ఉపేందర్‌రావు జాటోత్ రమేష్ పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టు మెజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్, అసిస్టెంట్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు గణేష్ ఆనంద్, రేవతి దేవిలు 24 మంది సాక్షులను విచారించి నింధితుడు జాటోత్ రామూర్తికి ఏడాది జైలు శిక్ష, రూ 5 వేల జరిమానా విధించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన కానిస్టేబుల్ లింగాల రాంబాబును డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఐ గణేష్ అభినందించారు.

కేయూ మెడికల్ ఆఫీసర్‌గా శంకర్

కేయూ క్యాంపస్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేయూ హెల్త్ సెంటర్‌కు నూతన మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులను అందచేశారు. కేయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌తో పాటు సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలల హెల్త్ సెంటర్‌లోనూ ఆయన విధులు నిర్వహిస్తారు.

బీసీ సెల్ డైరెక్టర్‌గా సతీశ్..

కేయూ జియాలజీ కాంట్రాక్టు అధ్యాపకుడు బి.సతీశ్‌ను కేయూ బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సెంటర్ కొత్త డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసులు పదవీ కాలం పూర్తవడంతో సతీశ్‌ను నియమించారు



మహబూబాబాద్ కొత్తబజారు ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించేందుకు బోనాలతో వెళ్తున్న హిజ్రాలు

బోనాలతో మొక్కులు చెల్లించుకున్న హిజ్రాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం కొత్తబజారులోని ముత్యాలమ్మ తల్లికి హిజ్రాలు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో బ్యాండు మేళాలు, డప్పు చప్పులతో హిజ్రాలు బోనాలు ఎత్తుకొని నృత్యాలు చేస్తూ అమ్మవారి వద్దకు చేరుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సురేందర్



వడ్డెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లికి చెందిన పాండవుల సురేందర్ ముదిరాజ్ బీసీ యువజన సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో బీసీ యూత్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాండవుల సురేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.

వైద్యం కోసం రోగి పడిగాపులు

● మూడు రోజులుగా వానలోనే.. ● స్పందించిన సూపరింటెండెంట్

వరంగల్ మెడికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓ రోగి వైద్య చికిత్స కోసం మూడు రోజులుగా ఎంజీఎంలో తడుస్తూ ఎదురు చూశాడు. చివరికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి చొరవతో రోగిని సర్జికల్ వార్డుకు తరలించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన బాసబోయిన రత్నాకర్ ఈ నెల 10న కడుపునొప్పితో ఎంజీఎం ఆస్పత్రికి వచ్చాడు. ఇక్కడి వైద్యులు కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ నెల 12న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా ఫైల్స్ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో రోగిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు.

తీరా ఎంజీఎంకు వచ్చాక ఫైల్స్‌కు సంబంధించిన పరికరాలు లేవంటూ చికిత్సకు నిరాకరించారు. అప్పటి నుంచి ఎంజీఎం ఎమర్జెన్సీ ఎదుట వైద్యం కోసం నిరీక్షిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి బుధవారం రోగి వద్దకు చేరుకొని సర్జికల్ వార్డులో చేర్పించారు. ఫైల్స్ సర్జరీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



రోగి వివరాలు తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ మురళి

నిట్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

● భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

● ర్యాలీకి నేతృత్వం వహించిన డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఎన్ఐటీలో బుధవారం సాయంత్రం తిరంగా ర్యాలీని ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి నేతృత్వం వహించారు. అకెడెమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, విద్యార్థి సంక్షేమం డీన్ ప్రొఫెసర్ కె కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని ప్రధాన పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ క్యాంపస్‌లోని పలు ప్రాంతాల మీదుగా సాగింది. దేశభక్తి, ఐక్యతకు సంబంధించిన శక్తివంతమైన నినాదాలతో క్యాంపస్ మారుమ్రోగింది. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఐకమత్యం, జాతీయ గౌరవాన్ని ప్రతిబింబించే నినాదాలు ర్యాలీలో పాల్గొన్నవారిలో స్ఫూర్తిని నింపాయి. భారత ప్రభుత్వానికి మద్దతు తెలపడం, జాతీయ ఏకీకరణ సందేశాన్ని వ్యాప్తి చేయడం ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంపై కళాశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. వరంగల్ నిట్ ప్రతీ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు నిట్ తన ప్రత్యేక కార్యక్రమాల పరంపరలో భాగంగా దీనిని నిర్వహిస్తుంది. నిట్ క్యాంపస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.





"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు.' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్ల

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్ల

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలావ్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహరి బాయి, 102 ఏళ్ల

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• **సాంత్వన్,** ఫొటోలు: హరిప్రేమ్

భార్య ఉండగానే రెండోపెళ్లికి ప్రయత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిలిచిన వివాహం

డోర్నకల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భార్య ఉండగానే మరోపెళ్లికి సిద్ధమైన యువకుడిని పోలీసులు అదుపులోకి కౌన్సిలింగ్ నిర్వహించిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మునిసిపల్ పరిధిలోని గొల్లబజారుకు చెందిన ఓ యువకుడు ఇటీవలనే మహిళను వివాహం చేసుకున్నాడు. అయితే ఈ విషయం దాచిపెట్టి రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. బుధవారం ఉదయం 11గంటలకు తన భర్త రెండో వివాహం చేసుకోబోతున్న విషయం తెలుసుకున్న భార్య పోలీసులకు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలో దిగిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పెళ్లి అర్ధాంతరంగా ఆగిపోయింది. అనంతరం పోలీసులు సదరు పెళ్లి కొడుకుకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఇలాగైతే పరిష్కారం ఎలా!?

(5వ పేజీ తరువాయి)

39,419 దరఖాస్తులు వచ్చాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో 53,763, ములుగు జిల్లాలో 32,118 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. ధరణిలో ఎదురైనా భూచిక్కులకు భూభారతిలో పరిష్కారం దొరుకుతుందనే ఆశతో రైతులు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేస్తున్నారు.

సాదాబైనామాల పరిష్కారమే సవాల్

భూ భారతిలో సాదాబైనామాల పరిష్కారం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. గ్రామాల్లో చాలామంది రైతులు రెవెన్యూ స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలపై భూములు క్రయ విక్రయాలు చేశారు. వీటిని రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా కాస్తులో కొనసాగుతున్నాయి. అయితే ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికి రికార్డుల్లో పేరు లేకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. గత ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తుందనే ఆశతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామా ల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. దీంతో దరఖాస్తులను పరిష్కరించాలని రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా రైతు సమస్యలు పరిష్కరించేందుకు రెవె న్యూ సదస్సు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో రెవెన్యూ సదస్సుల్లో తమ సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతోనే రైతులు దరఖాస్తులు చేసుకున్నారు.

పంద్రాగస్టుకు పరిష్కారం కష్టమే..

భూభారతిలో వచ్చిన దరఖాస్తులన్నీ ఆగస్టు 15లోగా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామాలకు సంబంధించినవే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 2,35,990 దరఖాస్తులు రాగా, వీటిలో 1,66,784 వరకు సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు 75శాతం సాదాబైనామాలు, అసైన్డ్ భూముల దరఖాస్తులే ఉండటంతో వాటి పరిష్కారం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 53,763 దరఖాస్తులు వస్తే, 50వేల మంది రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇందులో కేవలం 930 దరఖాస్తులే పరిష్కారం అయ్యాయి. అంటే కేవలం 2శాతం దరఖాస్తులు కూడా పరిష్కారం కాలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వరంగల్ జిల్లాలో 57,850 దరఖాస్తులు రాగా, వీటిలో 54,900 మందికి పైగా అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిలో 425 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించారు. దీనికి ప్రధానంగా దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామాలు, అసైన్డ్ భూములకు చెందినవే కావడంతో అధికారులు వాటిని పెండింగ్‌లో పెట్టారు. మొత్తం దరఖాస్తుల్లో 25వేలు సాదాబైనామా, 16వేల వరకు అసైన్డ్ దరఖాస్తులే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. మరికొన్ని దరఖాస్తుల్లో కోర్టు కేసుల్లో ఉన్నవి, కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్న దరఖాస్తులు ఉన్నాయి. ఇక సాదాబైనామాలపై కోర్టు తీర్పు కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోంది. తీర్పుకు అనుగుణంగా సమస్యల పరిష్కరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆగస్టు 15లోగా భూభారతి దరఖాస్తుల పరిష్కారం అసాధ్యంగా మిగిలింది.

వానొచ్చె.. వరదొచ్చె..

జలకళ సంతరించుకున్న చెరువులు, వాగులు



మత్తడి పోస్తున్న భూపాలపల్లి మండలంలోని నందిగామ సమీపంలోని చెరువు



ములుగు జిల్లా మంగపేట మండలం చెరుపల్లి పెద్ద చెరువు శివారులో వరదతో పొలాల్లో వేసిన ఇసుక మేటలు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అర్పనపల్లి వట్టివాగులో తగ్గిన ప్రవాహం



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని దొడ్ల-మల్యాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

పీటల మీద ఆగిన పెళ్లి..

- ప్రేమించిన యువతిని కాదని మరొకరితో వివాహానికి సిద్ధమైన యువకుడు
- వరుడిపై పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- పెళ్లికి నిరాకరించిన వధువు తల్లిదండ్రులు



పెళ్లి ఆగిపోవడంతో మూగబోయిన పెళ్లి మండపం

లింగాలఘణపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పచ్చని పందిళ్లు.. బ్యాండ్ మేళాలతో పెళ్లి మండపం కళకళలాడుతోంది.. బంధువులు ఒక్కొక్కరుగా పెళ్లి మండపానికి చేరుకుంటున్నారు. బుగ్గన చుక్కపెట్టుకుని.. నుదుట బాసికం కట్టుకుని.. పెళ్లిబట్టలతో ముస్తాబైన వరుడు ఫంక్షన్ హాల్‌లో తనకు కేటాయించిన గదిలో ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నాడు.. అప్పటికే రుచికరమైన వంటలతో ఘుమఘుమలాడే వాసన ఫంక్షన్ హాల్‌ను చుట్టుముట్టేసింది.. మరోవైపు వధువును ఫంక్షన్ హాల్‌కు తీసుకువచ్చి ఎదుర్కోళ్ల తంతుకు బంధువులు ఆతృత పడుతుండగానే పోలీసుల నుంచి ఓ షాకింగ్ సమాచారం అందింది..

అదేమిటంటే.. వరుడు ఓ యువతిని ప్రేమపేరిట మోసం చేసి గర్భిణీ చేశాడని నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు అందినట్లు స్థానిక పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు.. దీంతో అప్పటిదాకా పెళ్లి కళతో ఉన్న వధువు ముఖాన చిరునవ్వు చెదిరిపోయింది.. ఈ హఠాత్పరిణామానికి ఏం చేయాలో తోచక వధువు తల్లిదండ్రులు నిలబడ్డ చోటే కూలబడిపోయారు. బంధువులు, మిత్రుల ఓదార్పుతో కాసేపటికి తేరుకుని ఇక తమ కూతురుని ఇలాంటి మోసగాడికి ఇవ్వొద్దని నిశ్చయించుకున్నారు. ఈ సంఘటన బుధవారం లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల నక్షత్ర గార్డెన్‌లో చోటు చేసుకుంది.

వివరాల్లోకెళితే.. దేవరుప్పుల మండలం రామారాజుపల్లికి చెందిన హరీష్‌గౌడ్‌కు అదే మండలంలోని యువతితో పెళ్లి సంబంధం కుదిరింది. పెద్దల సమక్షంలో కట్నకానుకలను మాట్లాడుకుని బుధవారం పెళ్లి ముహూర్తాన్ని నిశ్చయించుకున్నారు. అనుకున్నట్లే ఎంగేజ్‌మెంట్ పూర్తయింది. బంధుమిత్రులను ఆహ్వానించుకున్నారు. వియ్యాలవారిద్దరూ అంతా సిద్ధం చేసుకోవడంతో వరుడు హరీష్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నాడు. మరికొద్దిసేపట్లో వధువు కూడా ఫంక్షన్‌హాల్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమయింది. ఆర్‌బీఎల్ అనే ప్రైవేట్ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న హరీష్ తనను ప్రేమించాడని తమ మధ్య శారీరక సంబంధం కూడా ఉందని హరీష్ కారణంగా తాను ఇప్పుడు గర్భవతినని, కాసేపట్లో హరీష్ పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడని పెళ్లిని అడ్డుకుని న్యాయం చేయాలంటూ విజయవాడకు చెందిన ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగిని నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దీంతో అక్కడి పోలీసులు విచారణలో భాగంగా దేవరుప్పుల పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక పోలీసులు విషయాన్ని అమ్మాయి తల్లిదండ్రులకు చేరవేయడంతో వధువును ఫంక్షన్‌హాల్‌కు తీసుకెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. మోసగాడికి ఇచ్చి పెళ్లి చేసేదిలేదని స్పష్టం చేశారు. అయితే అదే ఫంక్షన్‌హాల్‌లో ఇరువర్గాల పెద్దలు కూర్చు ని ఇప్పటికే అప్పగించిన కట్నకానుకలతో పాటుగా భోజనాలు, ఫంక్షన్ హాల్, పెళ్లిపందిరి ఖర్చులకు అదనంగా రూ. 4.50 లక్షలు వధువు కుటుంబానికి చెల్లించాలని తీర్మానించినట్లు తెలిసింది. పెళ్లి ఆగిపోయిన విషయం తెలియని బంధువులు ఫంక్షన్‌హాల్‌కు కుటుంబ సమేతంగా చేరుకుని మూగబోయిన పెళ్లి మండపాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. వరుడి చేసిన మోసంపై అమ్మాయి తరఫున బంధువులు తల్లిదండ్రులు శాపనార్థాలు పెట్టి వెళ్లిపోయారు. సుమారు 1500 మంది కోసం వండిన వంటలు అనాథాశ్రమంలో అందజేసినట్లు సమాచారం.



పెళ్లికి ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ←

ట్రాక్టర్ పైనుంచి పడి విద్యార్థి మృతి

- పాఠశాలకు వెళ్లి వస్తుండగా ఘటన

శాయంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి వస్తూ ఇంటికెళ్లే క్రమంలో ట్రాక్టర్ ఎక్కిన పదో తరగతి విద్యార్థి కింద పడిపోయి మృతి చెందాడు. ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామానికి చెందిన షేక్ కమాల్ అనే వ్యక్తి బండరాయి కొడుతూ జీవిస్తున్నాడు. కమాల్‌కు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు షేక్ ఫరాజ్ అహ్మద్(16) మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజూ హౌజ్‌బుజుర్గ్ నుంచి నేరేడుపల్లికి బస్సు లేదా కాలినడకన వచ్చి వెళ్తుంటాడు. ఈ నెల 12న సాయంత్రం పాఠశాలకు వెళ్లి ఇంటికెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన సయ్యద్ ఉమర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఫరాజ్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఎక్కారు. డ్రైవర్ సయ్యద్ ఉమర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ నేరేడుపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌లో నుంచి ఫరాజ్ అహ్మద్ కిందపడిపోయాడు. దీంతో తల, ఛాతి, నడుం భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆరెపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఫరాజ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి కమాల్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.



షేక్ ఫరాజ్ అహ్మద్ (ఫైల్)

జోరు వర్షం.. అతలాకుతలం

మంగపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు జోరుగా వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరద చేరింది. కమలాపురం ఎర్ర వాగు సమీపంలోని నివేశన ప్రాంతంలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఆ కుటుంబాలు రాత్రంతా జాగారం చేశారు. జీపీ ఉద్యోగులు సహాయక చర్యలు చేపట్టారు. అదే విధంగా మంగపేట కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల కాంగ్రెస్ కార్యలయంపై ఉరుము, మెరుపులతో పిడుగు పడింది. దీంతో భవనం పాక్షికంగా దెబ్బతినడమే కాకుండా అందులో గల ఎలక్రికల్ సామగ్రి కాలి పోయింది. విద్యుత్‌కు రాత్రంతా ఆ కాలనీలో అంతరాయం ఏర్పడింది. జోరువానతో చెరుపల్లి శివారు పెద్ద చెరువు నిండి మత్తడి పోస్తుండటంతో సుమారు 20 ఎకరాల్లో రైతులు నాటు వేసి ఉండగా ఇసుక మేటలు వేసింది. కొత్తూరుమొట్లగూడెం గ్రామ పంచా యతీ పరిధి తొండ్యాల లక్ష్మీపురం నీలకుంట చెరువు నిండి మత్తడి పోస్తోంది. దీంతో సుమారు 190 ఎకరాల్లో వరి పంట కొట్టుకుపోయింది. బొమ్మాయిగూడెం కొమరం సారయ్యకు చెందిన గుడిసె వర్షానికి కప్పకూలింది.

ఏటూరునాగారంలో జోరు వాన

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చిన్నబోయినపల్లి, రేయ్యూరు, శంకరాజుపల్లి, కొండాయి, చల్పాక తదితర గ్రామాల్లో వర్షం జోరుగా పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి మండలంలోని జంపన్నవాగు ఉధృ తంగా ప్రవహి స్తోంది. దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య జంపన్న వాగుకు వరద ఉధృతి పెరగటంతో కొండాయి, మల్యాల, ఐలాపురం తదితర గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. భానా జిబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల్లో జంపన్న వాగు వద్ద అధికారులు పడవలను ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు.


కమలాపురంలోని ఎర్రవాగు కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

రెడ్ అలర్ట్

(5వ పేజీ తరువాయి)

ఏర్పడింది. ఈ రెండు ఓసీల నుంచి కలిపి సంస్థకు రూ.6.50 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశా రు. బొగ్గు ఉత్పత్తి రోజుకు 10వేల టన్నులు చేయాల్సి ఉండగా కేవలం మూడు వేల టన్నులే సాధ్యమైందని ప్రకటించారు.

నిలిచిపోయిన రాకపోకలు

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కేశాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ కల్వర్టు, మహాముత్తారం సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. మహాముత్తారం వద్ద వాగులో మంగళవారం రాత్రి ఆటో కొట్టుకుపోవడంతో పోలీసులు వరద తగ్గే వరకు వాహనాలను అనుమతించలేదు. భారీ వర్షంతో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. బుధవారం సాయంత్రం వరకు వాగుల సమీపంలోని పంట పొలాల్లో వరద నీరు తగ్గలేదు. వాగులో కొట్టుకుపోయిన ఆటోను బయటకు తీశారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సుమారు 5సెం.మీల వర్షపాతం నమోదు కావడంతో పలు చోట్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరి రైతాంగానికి నష్టం వాటిల్లింది. పలు గ్రామాల పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల చుట్టూ, రహదారిపై వరదనీరు చేరి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం దాటికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు వరద నీటితో చెరువును తలపిస్తున్నాయి. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, గూడూరు ఇప్పమాటు వాగు, ఒడిపిలవంచ బండలవాగు, మల్లారం వాగులు భారీ వర్షానికి పొంగిపొర్లాయి. భారీ వర్షంతో చెరువులు మరోసారి మత్తుళ్లు దుముకుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

నీట మునిగిన పంట పొలాలు

గణపురం (ఆంధ్రజ్యోతి): సింగరేణి మట్టి గుట్టలతో తమ పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు చేరి తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మరావుపేట శివారులోని పెద్దమ్మకుంట సమీపంలో మూడేళ్ల క్రితమే తమ భూములు సింగరేణి అధికారులు హామీ ఇచ్చారని, హద్దులు కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అటు పరిహారం చెల్లించి భూములు తీసుకోకుండా, ఇటు చుట్టూ మట్టి గుట్టలు పోయడం ద్వారా వరద నీరు పొలాల్లో చేరి ప్రతి ఏటా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సుమారు 80ఎకరాల పంట నష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరయ్యారు.

ఉధృతంగా వరద నీరు

చిట్యాల (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండిపోయి మత్తళ్లు పోశాయి. మోరంచ వాగు ఉధృతితో మండలంలోని ఒడితల - పాశిగడ్డతండ, అందుకుండా నుంచి వెంచరామి, కుర్మపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ఉద్యోగులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చల్లగరిగ- ముచినిపర్తి గ్రామాల మధ్య పంట చేళ్ల నీటి ప్రవాహంతో రెండు గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ఉధృతికి చిట్యాల శివారు ఎస్సారెస్పీ కాల్వకు గండి పడింది. దీంతో సుమారు 10 ఎకరాల్లో పత్తిపంట దెబ్బతింది. చిట్యాల, జడల్‌పేట, బావుసింగ్‌పల్లి. తిరుమలపురం, గిద్దెముత్తారం, ఒడితల, నైన్‌పాక, అందుకుతండ, గిద్దెముత్తారం, కాల్వపల్లి, చిట్యాల, ఎలేటిరామయ్యపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తి, వరిపంటలు నీట మునిగాయి. ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్ బాబా, ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఎంపీవో రామకృష్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేందర్ వరద ప్రవాహాలను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు. వరదల ఉధృతితో ఇబ్బందులు వస్తే కంట్రోల్ రూం నెంబర్ 9030632608ను సంప్రదించాలని తహసీల్దార్ తెలిపారు.

భరోసా కల్పించేలా పనిచేయాలి : ఎస్పీ కిరణ్ ఖరే


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

మల్హర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించే విధంగా సిబ్బంది పని చేయాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మండలంలోని కొయ్యూర్‌లోని పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరుతో పాటు వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైళ్లను, పెండింగ్ ట్రాయల్లో సీడీ ఫైళ్లను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, సమస్యాత్మక గ్రామాల వివరాలను ఎస్సై నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిరంర నిఘా ఉంచి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్సైలు మహేంద్రకుమార్, రజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పుట్ట మధు పరామర్శ


పలిమెలలో ఓ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : పలిమెల మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు బుధవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చంఎదిన ఇందూరి రమేష్ మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీనారాయణ ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ఆయన్ను కూడా కలిసి పరామర్శించారు. మధు వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి, నాయకురాలు గీతాభాయి, స్థానిక నాయకులు ఉన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పర్యటించారు. రేగులగూడెం ఎస్సీ కాలనీలో ఇటీవల మృతిచెందిన నంది సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, నాయకులు జక్కు రాకేష్, నరివెద్ది శ్రీనివాస్, వంగల రాజేంద్రాచారి, జక్కు శ్రావణ్, ఉప్పు సంతోష్, అజ్మీరా దేవా, గాజుల విక్రమ్, తూటి మనోహర్, కొండపర్తి మురారి, పున్నం సతీష్ తదితరులు ఉన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు : డీఎస్పీ

కాటారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడితే భవిష్యత్ అంధకారమవుతుందని కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో డ్రగ్స్ మహమ్మారి నియంత్రణపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిజోలికి ఎవరూ వెళ్లొద్దని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులకు వీటిపై అవగాహన కల్పించాలని అన్నారు. బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు కృషి చేద్దామంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గీతారాథోడ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ ప్రతిజ్ఞ

చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నివారణ కోసం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల విదార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏఎస్సై మధుసూదన్, కానిస్టేబుళ్లు మారక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరమని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రఘుపతి, ప్రిన్సిపల్‌లు శ్రీదేవి, రమేష్, హెచ్‌సీ చంద్రమౌళి, కానిస్టేబుళ్లు నాగరాజు, సందీప్, అస్లాంజానీ, క్రాంతికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి సెక్యూరిటీ గార్డుకు చేయూత

కృష్ణకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు బండి రమేష్ అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆయనతో పని చేసే సెక్యూరిటీ గార్డులు, ఎస్అండ్‌పీసీ పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులు చేయూతనందించారు. బుధవారం సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజం చేతుల మీదుగా రూ.25 వేల నగదును బాధిత వ్యక్తి సతీమణి బండి రమాదేవికి అందించారు.

విద్యార్జనతోనే ఉన్నత శిఖరాలు

భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్జనతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి పేరును గడించాలని ఆకాంక్షించారు. మండలంలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో మాజీ సర్పంచ్ గొడ్డే నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మారుమూల పేరూరు ప్రాంతంలో చదువుల తల్లి విగ్రహాని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో మంచి ఫలితాలు సాధించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. అదే విధంగా చంద్రుపట్ల గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ అంజయ్య, గ్రామస్థుల సహకారంతో పాఠశాలకు బెంచీలు అందజేయగా వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. వాజేడు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. అదే విధంగా వరదలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మండల అభివృద్ధికి అధికారులు నిత్యం కృషి చేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు వరద ప్రభావిత ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆయన వెంట ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం, ఏటీడీవో క్షేత్రయ్య, ఏసీఎంవో రవీందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఎంఈవో వెంకటేశ్వర్లు, హెచ్ఎం భద్రాచలం, సీఐ ముత్యం రమేష్, ఎస్సై జక్కుల సతీష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు కల్యాణ్‌వర్మ, మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలత, నాయకులు రాంబాబు, సత్యనారాయణ, తల్లడి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.


సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

కాటారం ఏఎంసీ సర్వసభ్య సమావేశం


పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తిరుమల

కాటారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు అంశాలపై పాలకవర్గం చర్చించింది. ఏఎంసీకి ఉండబడిన 12ఎకరాల 9గుంటల స్థలాన్ని కబ్జా కాకుండా చర్యలు తీసుకుని ప్రహరీలను నిర్మించాలని తీర్మానించారు. రైతులకు తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం, కోల్డ్‌స్టోరేజ్ గోడౌన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వ సహాయంతో కృషి చేయాలని తీర్మానాలు చేశారు. రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని చర్చించారు. ఈ సమావేశంలో ఏడీఏ శ్రీపాల్, మార్కెట్ కార్యదర్శి లా షరీఫ్, వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరావు, శ్రీనివాస్, రమేష్, రామకృష్ణ, షరీఫ్, రాజారాం, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సడువలి, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోడౌన్ సందర్శన

మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల గోడౌన్‌ను ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య బుధవారం సందర్శించారు. ఆంధ్రజ్యోతిలో 'యూరియా కోసం రైతులు బారులు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో గోడౌన్‌ను పరిశీలించి యూరియా బస్తాల పంపిణీ జరుగుతున్న తీరును పర్యవేక్షిం చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాటారం డివిజన్‌కు యూరియా బస్తాలు నిరంతరం సరఫరా జరుగుతున్నాయని, రైతులు యూరియా కోసం ఆందోళన చెంది బస్తాలను ఎక్కువగా తీసుకుని నిల్వ చేయాల్సిన అవసరం లేదని అన్నారు.

నీరు నిల్వకుండా శాశ్వత చర్యలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు నిల్వకుండా మళ్లించేలా శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం, చికెన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన బుధవారం పర్య టించారు. గొల్లబుద్దారం పాఠశాలను పరిశీలించి నీరు పాఠ శాలలోకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. గ్రామంలోని పలు ఇళ్లను సైతం పరిశీలించారు. ఆయన వెంట ఆర్అండ్ బీ ఈఈ రమేష్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈవో రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నాగరాజు ఉన్నారు.

'బీజేపీ ప్రభుత్వం దిగిపోవాలి'

కాటారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని యూఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు బుధవారం విలేక రులతో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో బీజేపీ ఓట్ల తారు మారు చేయడంతో పాటు ఈసీ సాయంతో ఈవీఎంల్లో గోల్ మాల్ చేసిందని ఆరోపించారు. వీరి వెంట ప్రజా సంఘాల జిల్లా నాయకుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలీస్ సర్కిల్‌గా గణపురం

(5వ పేజీ తరువాయి)

మరో ప్రదేశంలో పోలీస్ స్టేషన్‌ను 1970లో అప్పటి ప్రభుత్వం నిర్మించిందని మండల ప్రజలు చెబుతున్నారు. ఆ తర్వాత ములుగు సర్కిల్ పరిధిలో గణపురం కొనసాగింది. 2009లో భూపాలపల్లి నియోజకవర్గం ఏర్పాటైనప్పటికీ 2018 వరకు ములుగు సర్కిల్‌గానే కొనసాగింది. అనంతరం ములుగు జిల్లా ఏర్పాటు కావడంతో అధికార యంత్రాంగం, పాలకులు గణపురం ఠాణాను చిట్యాల సర్కిల్‌కు అటాచ్ చేశారు. దీంతో గణపురం, ఉమ్మడి రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు ఒకే సర్కిల్ కేంద్రంగా కొనసాగుతోంది. ఇటీవల గోరికొత్తపల్లి కూడా నూతన మండలంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌ను కూడా అక్కడ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రేగొండ, గోరికొత్తపల్లి, గణపురం మూడు మండలాలను కలుపుకొని గణపురాన్ని సర్కిల్‌గా ఏర్పాటు చేస్తున్నారు.

నూతన సీఐగా కరుణాకర్‌రావు

గణపురం సర్కిల్ నూతన సీఐగా కరుణాకర్‌రావును నియమిస్తున్నట్లు మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినాయి. ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి గణపురం సర్కిల్ ఇన్స్‌క్టర్‌గా ఆయన బదిలీ అయ్యారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మహిళా సాధికారత కాంక్షతో..

ములుగు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డికి చెందిన యువతి బానోత్ వెన్నెల చేప ట్టిన సైకిల్ యాత్ర బుధ వారం ములుగుకు చేరు కుంది. మహిళా సాధికారతను కాంక్షిస్తూ ఆమె సైకిల్ యాత్ర ప్రారంభించగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతోంది. ములుగుకు చేరుకున్న వెన్నెలకు జిల్లా రైస్ మిల్లర్స్ అసో సియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ స్వాగతం పలికారు. మహిళా సాధికారత ఆకాంక్షతో ఆమె సైకిల్ యాత్ర చేపట్టడాన్ని అభినందిస్తూ సన్మానించారు. డిగ్రీ చదువుతున్న యువతి ఇంతటి సాహసం చేయడం గర్వించదగ్గ విషయ మని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువ జన కాంగ్రెస్ నాయకులు మైపాల్ రెడ్డి, ఆకుతోట అన్వేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వెన్నెలను సన్మానిస్తున్న జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రవాణా శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్

ములుగు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రవాణా శాఖ జిల్లా అధికారి బారగడి శ్రీనివాస్ అన్నారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాలను ఎవరైనా సరఫరా చేస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు తెలపాలని అన్నారు. అనంతరం యువతతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టోల్ గేట్లను ఎత్తివేయాలి : సీపీఎం

వాజేడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏటూరునాగారం, పస్రా అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టోల్ గేట్లను ఎత్తివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు బుధవారం వినతిప్రతం అందించారు. సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ జాతీయ రహదారిపై అటవీశాఖ అధికారులు టోల్‌గేట్లను ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులను సైతం వదలకుండా టోల్ చార్జీలను వసూలు చేయడం అన్యాయమన్నారు. నిరుద్యోగులు పొట్టతిప్పల కోసం కార్లు, టాటా మ్యాజిక్‌లు, ట్రాలీ బొలెరోలు నడుపుకుంటుండగా వారిపై టోల్ చార్జీలు వసూలు చేయటం సరికాదన్నారు. దీనిపై మంత్రి సీతక్క ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్, కృష్ణబాబు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ములుగు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు జేడీ మల్లంపల్లి మండలం మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామంలో బుధవారం పర్యటించారు. వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు తెలిపారు. వరి నాట్లు తొందరగా పూర్తిచేయాలన్నారు. ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సీజీ గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున పంట నాటిన 15 రోజుల్లో వేయాలని సూచించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను అమర్చాలన్నారు. అంతర్వాహిక మందులైన ఫిప్రోనిల్ 2 ఎంఎల్, ఎసిఫేట్ 1.5గ్రాం లీటరు నీటికి కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. పంటలను సందర్శించిన వారిలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్, శాస్త్రవేత్తలు ఆర్ శ్రావణ్ కుమార్, హరి, కె మానస, సౌందర్య, విస్తరణ శాఖ అధికారులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

వెంకటాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఏపీఎం అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో మహిళా సమాఖ్య స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ తరగతులు బుధవారం జరగ్గా ఆయన మాట్లాడారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఈనెల 15 నుంచి 30 వరకు నూతన సభ్యులను చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, కిషోర బాలికలకు కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళా సంఘాల్లో తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చని, సంఘంలోని సభ్యులకు రూ.2లక్షల వరకు రుణబీమా, రూ.10లక్షల వరకు ప్రమాదబీమా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీసీలు నర్సయ్య, సమ్మయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పశువులను రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్టు

ములుగు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని బండారుపల్లి క్రాస్ రోడ్డులో ఎస్సై ఇమ్మానియేల్ నేతృత్వంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా గూడ్స్ వాహనంలో నాలుగు ఆవులు, రెండు ఎద్దులు కనిపించాయి. వాటిని నిర్బంధించి అక్రమంగా తరలిస్తుండగా గుర్తించిన పోలీసులు ఆ వ్యక్తులను అరెస్టు చేశారు. పశువులను గోశాలకు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెంకటాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలోని చిడెం వారివీదిలో చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిడెంవారివీధిలోని వనపర్తి చంద్రయ్యకు చెందిన పెంకుటింట్లో అనుకోకుండా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈప్రమాదంలో టీవీతోపాటు కొంత సామగ్రి కాలిపోయిందని, సుమారు రూ.50 వేల నష్టం జరిగి ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. కాగా, ఈవిషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు


మంటలను ఆర్పుతున్న కాలనీవాసులు

ములుగు మార్కెట్ కమిటీ సమావేశం

ములుగు టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కమిటీ కార్యదర్శి సోనియా ఆధ్వర్యంలో బుధవారం పాలకవర్గం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ రేగా కల్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడేళ్లుగా మార్కెట్ కమిటీ పాలక వర్గం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రైతులకు సేవ చేయడమే తమ పాలకవర్గ ముఖ్య లక్ష్యమన్నారు. లైసెన్స్ లేని పత్తి కొనుగోలను నివారించి, ప్రభుత్వమే నేరుగా రైతుల వద్ద కొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్లవేళలా మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సేద సారంగం, గోవిందరావు పేట మండల సహకార సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు రసపుత్ సీతరాం నాయక్, కొమురం బాలయ్య, లక్కీ వెంకన్న, ముక్తి రామస్వామి, చెర్ప పగడయ్య, పాలకుర్తి సమ్మయ్య, అర్రెం వెంకన్న, ఆలోత్ దేవ్ సింగ్, పెద్ది రాజ్ కుమార్, పోరిక ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం, కమ్మరిగూడెం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటి ఫీవర్‌సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు, వారిలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, పవన్‌కళ్యాణ్, ఆశిష్, డీపీఎంవో సత్యనారాయణ, హెచ్‌ఐవో కోటిరెడ్డి, సిబ్బంది యాకలక్ష్మి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.